


# కరపత్రం

SINCE 2014

గురువారం అక్టోబర్ 01,2026 | సంపుటి : 2 | సంచిక : 353 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ఈసారి సిరిసిల్లపై గురి పెడదాం

# సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దాం

- గజ్వేల్ గడీని కూల్చాం.. సిరిసిల్లను కూల్చుతాం
- కేటీఆర్‌కు కాంగ్రెస్ గురించి ఏం తెలుసు?
- బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది
- సిరిసిల్ల సమస్యల వలయంగా మారింది
- ప్రజల ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకున్నారంటూ విమర్శ
- గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపణ

పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ అన్నట్లుగా.. కేటీఆర్ కు ఏం తెలుసు కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ గురించి అని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 సెప్టెంబర్ 30న సిరిసిల్ల బహిరంగ సభలో మాట్లాడిన సీఎం.. కాంగ్రెస్ గురించి, రేవంత్ గురించి ఫామ్ హౌస్ లో పడుకున్న మీ తండ్రి కేసీఆర్ గురించి అడుగమని సలహా ఇచ్చారు.
ఈ సందర్భంగా సిరిసిల్ల గడ్డమీద గురిపెడదామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు రేవంత్. ఈసారి సిరిసిల్ల గడీని కూల్చేస్తామని హెచ్చరించారు.

ఆనాడు గజ్వేల్ గడీని నేలమట్టం చేస్తామని చెప్పినం.. చేసి చూపించాం.. ఈ సారి సిరిసిల్ల గడీని కూల్చేస్తామని చెప్పారు.
ధైర్యం, దైవం కలగలిసిన ప్రాంతం సిరిసిల్ల అని అన్నారు సీఎం రేవంత్. సిరసాల అనే పేరు నుంచి సిరిసిల్ల వచ్చిందని.. సిరసాల అంటే సిరులకు నిలయమని అన్నారు. అలాంటిది పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందన్నారు.
సిరిసిల్ల ప్రజలు వేసిన ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకుని కేటీఆర్ కోట్లు సంపాదించాడని అన్నారు సీఎం రేవంత్. సిరిసిల్లను సమస్యల వలయంగా కేటీఆర్ మార్చారని విమర్శించారు. వలసపోయిన గల్ఫ్ కార్మికులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని అన్నారు.



2 లో

## ప్రభుత్వానికి మంచి పేరు.. చెడ్డపేరు ఉద్యోగుల వల్లే

- ఉద్యోగులే ప్రభుత్వానికి ప్రతినిధులు
- ప్రజలను కుటుంబు సభ్యుల్లా చూడాలి
- సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి
- 10.5 లక్షల మంది ఉద్యోగులు.. 4 కోట్ల ప్రజలకు సేవలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు
- పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వేదిక కావాలి

# రాజస్థాన్ ఒప్పందం రద్దు చేయాలి



- జైపూర్ విద్యుత్ ఒప్పందంపై మాజీ మంత్రి అభ్యంతరం
- 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయించడంపై ప్రశ్న
- మన బొగ్గు.. మన నీళ్లు.. కరెంటుపై హక్కు తెలంగాణదే
- విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం: హరీశ్‌రావు
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీ ఏమైంది?
- తెలంగాణ వనరులను ఇతర రాష్ట్రాలకు మళ్లించొద్దు

**హైదరాబాద్:**
సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ విద్యుత్ విషయంలో రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవైపు కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.
“మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉంది... నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కనే ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయి. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది... అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా. ఇటీవల సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారు” అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణి... అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7..8 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు.




## మందుబాబులకు బ్యాడ్ న్యూస్.. మద్యం దుకాణాలు బంద్.. ఆ రోజు పూర్తిగా క్లోజ్..

మందుబాబులకు బ్యాడ్ న్యూస్. హైదరాబాద్‌లో మద్యం దుకాణాలన్నీ అక్టోబర్ 2వ తేదీన బంద్ కానున్నాయి. గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యం షాపులను మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, పబ్‌లు, క్లబ్‌లకు ఈ ఆదేశాలు వర్తింపచేస్తాయని ప్రకటించారు.

2 లో



## ఎయిర్‌పోర్టులో అనుమానంగా కనిపించిన ప్రయాణికుడు.. ఆపి చెక్ చేయగా..

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మరోసారి భారీ స్థాయిలో మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి ఏకంగా రూ.24.5 కోట్ల విలువైన 4.9 కేజీల కొకైన్‌ను సీజ్ చేశారు డీఆర్ఐ అధికారులు. సదరు ప్రయాణికుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

## పేషెంట్లుగా వెళ్లిన పోలీసులు...

# నకిలీ డాక్టర్లకు బిగ్ షాక్!



- పట్టుబడిన శ్యాంసుందర్
- ఆకస్మిక తనిఖీలతో ఐదుగురు నకిలీ వైద్యుల అరెస్ట్
- మల్లాపూర్‌లో ముగ్గురు, రాంగోపాల్‌పేట, మేడిపల్లిలో ఒకరి చొప్పున

2లో..

**హైదరాబాద్:**
ఐదుగురు నకిలీ వైద్యులు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. మల్లాపూర్ పరిధిలో ముగ్గురు, రాంగోపాల్‌పేట, మేడిపల్లిలో ఒకరి చొప్పున పోలీసులు అరెస్టు చేశారు. ఎలాంటి వైద్య విద్యార్హతలు, రిజిస్ట్రేషన్, అనుమతులు లేకుండా సేవలు అందిస్తున్న నకిలీ వైద్యుల వద్దకు పోలీసులు రోగుల రూపంలో వెళ్లారు. వైద్యవిధానాన్ని పరిశీలించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.




2లో..

## ఈసీపై ఐక్య పోరాటం

# ఇండియా కూటమి

- అక్టోబర్ 2--8 దేశవ్యాప్త పాదయాత్ర
- 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీ
- బ్యాలెట్ పేపర్లకు ఖర్గే డిమాండ్
- సీఈసీ రాజీనామాకు రాహుల్ డిమాండ్
- ఆందోళన తీవ్రతరం చేస్తాం: రాహుల్

కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, మార్చ్ చేపట్టాలని ‘ఇండియా కూటమి’ నేతలు నిర్ణయించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2నుంచి 8వరకు వారం రోజుల పాటు ‘ప్రజాస్వామ్యాన్ని కాపాడండి’ అనే నినాదంతో పాదయాత్ర చేపట్టనున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు వెల్లడించారు.

## ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ

- వాణిజ్యం, రక్షణపై చర్చలు
- ఇంధనం, టెక్నాలజీపై సమీక్ష
- ద్వైపాక్షిక సహకారంపై చర్చ
- ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలతో పాటు ఆయా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్నట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా రెండు దేశాలు సన్నిహిత సంబంధాలను కొనసాగించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు.ప్రపంచ శాంతి, భద్రత పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు తెలిపారు.

## మానవ నమ్మకాలే

# సైబర్ నేరగాళ్ల ఆయుధం

- సైబర్ నష్టాల్లో 60% ఇన్వెస్ట్‌మెంట్ మోసాలే
- నమ్మించి.. మోసగించి.. ఖాతాలు ఖాళీ
- విదేశాల నుంచి కాల్‌సెంటర్లతో సైబర్ ముఠాలు
- అప్రమత్తతే అతిపెద్ద రక్షణ
- రెండేళ్లలో రూ.455 కోట్ల సొమ్ము రికవరీ
- ఏఐపై అతిగా ఆధారపడొద్దు: నిపుణుల హెచ్చరిక
- డీప్‌ఫేక్‌లకు ప్రత్యేక చట్టం అవసరం
- ఫోన్ నంబర్ షేర్ చేయొద్దు: సైబర్ నిపుణులు



సైబర్ నేరాలు ఇక కేవలం సాంకేతిక పరిజ్ఞానాల మధ్య పోరాటం కాదని, అవి మానవ నమ్మకం, ఆలోచనా సరళి, మన ప్రవర్తనను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడిగా మారాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ పోలీసు శాఖల భాగస్వామ్యంతో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి మానవ నమ్మకాలు ఎలా ప్రభావితం చేస్తాయనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో నమోదవుతున్న సైబర్ నేరాల ఆర్థిక నష్టాల్లో దాదాపు 60 శాతం నష్టాలు స్టాక్ మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వల్లే జరుగుతున్నాయని ఆమె వెల్లడించారు.

మిగతాద్ది 2 లో

## ఉల్లి పండించే ప్రాంతంలోనే కిలో 90 రూపాయలు..

ఉల్లిగడ్డను కోస్తేనే కాదు.. తలచుకుంటేనే కన్నీళ్లు వచ్చేలా ఉంది . ధరలు భారీగా పెరుగుతుండటంతో సామాన్యుడి కూరల్లో ఉల్లిపాయలు కనిపించని పరిస్థితి. నిన్న మొన్నటి దాక కేజీ ఉల్లిగడ్డ 40, 70 రూపాయల దగ్గర ఉండగా.. ఇప్పుడు ఏకంగా సెంచరీకి చేరువకావడం షాకింగ్ న్యూస్.



02

దేశ వ్యాప్తంగా ఉల్లి ధరలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే అంశమైతే.. ఉల్లి పండించే ప్రాంతాల్లో కూడా కేజీ 90 రూపాయలకు చేరువ కావడం కళ్లల్లో నీళ్లు వచ్చే అంశమే. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దేశ వ్యాప్తంగా ఆనియన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే నవంబర్ లో కొత్త పంట వచ్చే వరకు 90 రూపాయలకు కేజీ అయ్యే ఛాన్సెస్ ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలో ఉల్లిపాయలు బాగా పండిస్తారు. అలాంటిది ఛత్రపతి శంభాజీ నగర్ లో ఉల్లిగడ్డల ధరలు చుక్కలు చూపించడం ఆందోళనకరమైన విషయం.




## దేశంలో మొట్టమొదటిసారి.. మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు

2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం అక్టోబర్ 01,2026

# ఈసీపై ఐక్య పోరాటం ఇండియా కూటమి

మొదటిపేజీ తరువాయి

కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఎన్నికల సంఘాన్ని భాజపా నేతలు ఏ రకంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై మేమంతా (ఇండియా కూటమి నేతలు) ఐక్యంగా పోరాడతాం. అధికారం కోసం మోదీ, అమిత్ షా ఈసీని ఓ రబ్బర్ స్టాంపులా వినియోగిస్తున్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించినా ఈసీ పట్టించుకోలేదు. ఈవీఎంల పనితీరుపై ఎంతో కాలంగా సమాధానం కోరుతున్నా స్పందించ లేదు. ఇకపై ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లు తీసుకురావాలి. సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే ఎన్నికల సమయంలో పరిగణలోకి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

**వారికి తగిన శిక్ష పడాల్సిందే: రాహుల్ గాంధీ**

తమ స్వలాభం కోసం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'వారు ఎంత పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. భారత ప్రజాస్వామ్యం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి కన్నా ఎంతో గొప్పది. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని మేం చెప్పే మాటలు నిజమేనని ఇప్పుడు ప్రజలకు కూడా తెలిసింది. ఈ ప్రభుత్వ అవినీతిని వారే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పు ఒప్పుకొని, పదవికి రాజీనామా చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలగకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తాం' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి సమావేశంలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

# మానవ నమ్మకాలే సైబర్ నేరగాళ్ల ఆయుధం

మొదటిపేజీ తరువాయి

బాధితుల ప్రవర్తనను అధ్యయనం చేస్తూ వారిలో నమ్మకం కలిగించి డబ్బులు బదిలీ చేసేలా వియత్నాం, మయన్మార్, కాంబోడియా వంటి విదేశాల నుంచి ఈ సైబర్ ముఠాలు కాల్ సెంటర్ల ద్వారా నెట్‌వర్క్ నడుపుతున్నాయని స్పష్టం చేశారు. అయితే, అప్రమత్తతే అతిపెద్ద రక్షణ అని, గత రెండేళ్లలో తెలంగాణ పోలీసు శాఖ రూ.455 కోట్ల బాధితుల సొమ్మును రికవరీ చేయగలిగిందని తెలిపారు. 'ఏమీ తెలియదనే అమాయకత్వం మిమ్మల్ని కాపాడదు. ఆలోచించి, అన్ని అంశాలు సరిచూసుకున్నాకే ముందడుగు వేయాలి' అని సూచించారు.

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, సైబర్ లా నిపుణులు పవన్ దుగ్గల్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధపై అతిగా ఆధారపడటం మానవ మేధస్సును క్షీణింపజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ చిన్న విషయానికి ఏఐని సంప్రదించి మానవ ఆలోచనా శక్తిని తగ్గించుకోకూడదని హెచ్చరించారు. ఏఐ డీప్‌ఫేక్‌ల నిరోధానికి దేశంలో తక్షణమే ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టు 'కోర్టుల్లో ఏఐ వినియోగంపై డ్రాఫ్ట్ నిబంధనలు - 2026' రూపొందించిందని గుర్తుచేశారు.

డీఎస్‌సీఐ అడ్వైజర్ ఎయిర్ వైస్ మార్షల్ దేవేష్ వత్స మాట్లాడుతూ.. రామాయణంలోని లక్ష్మణ రేఖయే ప్రపంచంలో మొదటి ఫైర్‌వాల్ అని వ్యాఖ్యానించారు. సైబర్ నిపుణులు జితేన్ జైన్ మాట్లాడుతూ.. ఫోన్ నంబర్లను షాపింగ్ మాల్స్‌లో ఇవ్వొద్దని, ఇది సోషల్ ఇంజినీరింగ్ దాడులకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ అవగాహన వీడియోలు, పోస్టర్లను ఆవిష్కరించారు. 2.95 లక్షల మంది పెన్షనర్లు, మూడు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు వీటి ద్వారా అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్..

## మద్యం దుకాణాలు బంద్.. ఆ రోజు పూర్తిగా క్లోజ్..

మొదటిపేజీ తరువాయి

ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని నగర పరిధిలోని పోలీస్ కమిషనర్లకు జీహెచ్ఎంసీ సూచించింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. గాంధీ జయంతి సందర్భంగా ప్రతీ ఏడాది అక్టోబర్ 2న మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ఈ సారి కూడా అదే రూల్ పాటించాలని జీహెచ్ఎంసీ కోరింది. మద్యం దుకాణాలు డ్రై డేగా పాటించాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. గాంధీజీ అహింసా సిద్ధాంతాలు, ఆయనను గౌరవిస్తూ మద్యం దుకాణాలు మూసివేయాలని జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు నగరవ్యాప్తంగా మద్యం అమ్మకాలు అక్టోబర్ 2వ తేదీన బంద్ కానున్నాయి. ఈ మార్గదర్శకాలను వ్యాపారులు, ప్రజలు పాటించాలని అధికారులు కోరారు. ఎవరైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చట్టప్రకారం చర్లయు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు,వ్యాపారులు దీనికి సహకరించాలని కోరారు. అక్టోబర్ 2వ తేదీ వేకువజామున నుంచి అర్ధరాత్రి వరకు మద్యం షాపులు బంద్ అవుతాయి. తిరిగి అక్టోబర్ 3న ఉదయం తెరుచుకుంటాయి.

వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లలోని మద్యం సరఫరా, పబ్‌లు, స్టార్ హోటళ్లలో మద్యం సర్వ్ చేయడం, క్లబ్‌లకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని జీహెచ్ఎంసీ తెలిపింది. ఇక కల్లు దుకాణాలు కూడా బంద్ కానున్నాయి. మద్యం విక్రయిస్తే ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేసే అవకాశం కూడా ఉంటుంది. హైదరాబాద్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2న మద్యం అమ్మకాలు బంద్ అవుతాయి. దేశవ్యాప్తంగా డ్రైడే అమల్లో ఉంటుంది. అటు చికెన్, మటన్, బీఫ్ దుకాణాలు కూడా బంద్ అవుతాయి. మేకలు, గొర్రెలు, పశువుల వధశాలలతో పాటు చికెన్, మటన్, బీఫ్ షాపులు అక్టోబర్ 2న పూర్తిగా మూతపడనున్నాయి.

# దేశంలో మొట్టమొదటిసారి.. మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డిపై బినామీ యాక్ట్ కింద కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే తొలిసారి బినామీ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి, ఆయన బినామీలపై మొట్టమొదటిసారి బినామీ యాక్ట్ కింద కేసులు నమోదు అయ్యాయి. గతంలో తెలంగాణ, కర్ణాటకలోని 16 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించాయి. ఆయన బినామీల ఇళ్లల్లో జరిగిన సోదాల్లో ఆస్తుల పత్రాలు, నగదు, బంగారం వివరాలు లభించాయి. వాటి అసలు యజమాని, ఎక్కడి నుంచి వచ్చాయి, భీమ్‌రెడ్డితో వారికి ఉన్న సంబంధాలపై ఏసీబీ, ఐటీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భారీగా ఆస్తులను గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆ తర్వాత చేపట్టిన దర్యాప్తు ఆధారంగా ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఐటీ మరింత దూకుడు పెంచాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల చట్టం కింద కేసులు నమోదు చేశాయి. ఇది దేశంలోనే తొలిసారిగా బినామీ లావాదేవీల చట్టం కింద ఇలాంటి కేసుల నమోదు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27వ తేదీన నమోదైన ఈ కేసులో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ వర్గాల ద్వారా వెల్లడైంది.

ఈ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతర వ్యక్తుల పేర్లపై ఉన్నప్పటికీ వాటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. దీంతో బినామీ ఆస్తుల కోణంలోనూ దర్యాప్తును అధికారులు చేపట్టారు. బినామీ ఆస్తులకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు.

హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, ఇతర కీలక ఆధారాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. ఆ ఆస్తులకు అసలు యజమాని ఎవరు అనే అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ఏసీబీ దర్యాప్తులో లభించిన సమాచారాన్ని పరిశీలించిన ఐటీ శాఖ.. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లపై ఉన్న ఆస్తులకు అసలు పెట్టుబడులు ఎవరివి.. ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలం ఏంటి.. ఆస్తులను ఎవరు కంట్రోల్ చేస్తున్నారు వంటి అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు.

బినామీ చట్టం కింద నమోదైన కేసుల నేపథ్యంలో సంబంధిత ఆస్తులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దర్యాప్తులో బినామీ లావాదేవీలు నిర్ధారణ అయితే ఆయా ఆస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. భీమ్‌రెడ్డి వ్యవహారంలో ఏసీబీ ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులతో పాటు బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు సమాచారం.

బినామీల పేరిట ఉన్న ఆస్తులు కూడా దర్యాప్తులో భాగం కావడంతో మొత్తం ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసులో సుమారు 57 రోజుల పాటు భీమ్‌రెడ్డి చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 1వ తేదీన బెయిల్‌పై విడుదల అయ్యారు. అయితే ఆయనపై నమోదైన కేసులో దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ప్రస్తుతం ఏసీబీతో పాటు ఐటీ అధికారులు కూడా బినామీ ఆస్తులపై దృష్టి పెట్టడంతో కేసు మరింత కీలకంగా మారింది. మరోవైపు ఈ వ్యవహారంలో ఈడీ కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో బినామీ ఆస్తులపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మీరు ఏం అభిప్రాయపడుతున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.

# ప్రేమను నిరాకరించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడి



ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ఓ యువకుడు ఏడాది కాలంగా వేధిస్తున్నాడు. నిరాకరించిన ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన యువతి(25) ఐటీ ఉద్యోగిని. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మాదాపూర్‌లో నివాసం ఉంటోంది. అదే సంస్థలో పని చేస్తున్న ఆకాశ్.. ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. గతంలో ఆమె మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెనక్కి తగ్గాడు. దిల్లీలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయంలో బెదిరించి కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు బయలుదేరాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో ఆకాశ్ ఆమెను పిడిగుద్దులు గుద్ది కారు నుంచి దింపేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేషెంట్లుగా వెళ్లిన పోలీసులు...

# నకిలీ డాక్టర్లకు బిగ్ షాక్!

మొదటిపేజీ తరువాయి

మల్లాపూర్ చండీయానగర్‌లో నవోదయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో చికిత్స అందిస్తున్న ఇస్మాయిల్, వెంకటరమణ కాలనీలో రుదీక్ష మెడికల్ జనరల్ స్టోర్ పేరుతో గంగుల సాయితేజ, సూర్యనగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ పేరుతో వైద్యసేవలు అందిస్తున్న పూల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైబెల్లి తెలిపారు.

గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 'మైసమ్మ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్' పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్న కేశవరావు అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. క్లినిక్ వద్ద రిజిస్ట్రేషన్ నంబర్ పేరుతో వివరాలు ప్రదర్శించినప్పటికీ, పోలీసులు తనిఖీ చేసిన సమయంలో సరైన అనుమతులు, పత్రాలు చూపించలేదని సమాచారం. మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు క్లినిక్‌పై దాడి చేసి కేశవరావును అదుపులోకి తీసుకున్నారు. కాగా, బోడుప్పల్ బొల్లిగూడెం శ్రీసాయి నగర్ శ్రీలక్ష??మీనర్సిహ క్లినిక్ నిర్వహిస్తున్న బోడ శ్యాంసుందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు వచ్చినా ఉద్యోగుల వల్లే: రేవంత్

మొదటిపేజీ తరువాయి

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే.. ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం.. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబ సభ్యుల్లా చూడాలని అధికారులకు సూచించారు.

"అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇంకా సమస్యలున్నాయి.. ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలి. 10.5లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారు. మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని. మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల వల్లే. సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయట్లేదంటారు. ప్రజల కోసం ఎన్ని చట్టాలు చేసినా.. నిధులు ఇచ్చినా చేరవేయాల్సింది ఉద్యోగులే. పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయం ఉపయోగపడాలి" అని సీఎం అన్నారు. సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్ , రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఉల్లి పండించే ప్రాంతంలోనే కిలో 90 రూపాయలు..

మొదటిపేజీ తరువాయి

సిటీకి ఎక్కువగా సిల్లోడ్, అలంద్, ఫులంబ్రి, గనోరి.. మొదలైన ప్రాంతాల నుంచి వస్తుంటాయి. అయితే వర్షాభావం కారణంగా పంట సాగు తగ్గిందని.. సిటీకి ఉల్లిగడ్డలు చాలా మేరకు తగ్గిపోయాయని చెబుతున్నారు. ఉల్లి పండించే ప్రాంతంలోనే ఇలా ఉంటే ఇతర ప్రాంతాల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు.

# ఎయిర్‌పోర్టులో అనుమానంగా కనిపించిన ప్రయాణికుడు.. ఆపి చెక్ చేయగా..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పోలీసులు కొత్త విధానాలను అమలు చేస్తుంటే.. కొందరు కేటుగాళ్లు మాత్రం.. అక్రమంగా రాష్ట్రంలోకి మత్తుపదార్థాలను సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా ఇలానే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.24.5 కోట్ల విలువైన కొకైన్‌ను సీజ్ చేశారు డీఆర్ఐ అధికారులు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి విదేశాల నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఓ ప్రయాణికుడి దగ్గర ఈ భారీ మొత్తంలోని కొకైన్ పట్టుబడింది. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తుండగా.. సదరు ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన డీఆర్ఐ అధికారులు.. అతన్ని ఆపి చెక్ చేయగా.. క్యాబిన్ బ్యాగేజీలో ఏడు డార్క్ చాక్లెట్ డబ్బాలు కనిపించాయి.

అయితే వాటిని ఓపెన్ చేసి చూడగా.. అందులో చాక్లెట్లతో పాటు 207 కొకైన్ క్యాప్సూల్స్ ఉన్నట్టు గుర్తించారు అధికారులు. పట్టుబడిన కొకైన్ మొత్తం సుమారు 4.9 కేజీలు ఉందని... బహిరంగ మార్కెట్‌లో ఈ కొకైన్ విలువ రూ.24.5 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు తెలిపారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు ఘటనపై కేసు నమోదు చేసి.. ఈ రాకెట్ వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# రష్యాలో ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులు కావద్దు! - కేంద్రం హెచ్చరిక



విదేశాల్లో ఉద్యోగాలంటూ వస్తున్న వార్తలపై భారత విదేశాంగ శాఖ మరోసారి స్పందించింది. రష్యా సాయుధ దళాల్లో భారతీయులను నియమించుకుంటున్నట్లు నివేదికలు వస్తూనే ఉన్నాయని, ఇందులో ఉన్న నష్టాలు, ప్రమాదాల గురించి గత రెండేళ్లుగా చెబుతూనే ఉన్నామని పేర్కొంది. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించే భారతీయులు.. ధ్రువీకరించని వ్యక్తులు, ఏజెంట్ల ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దని హెచ్చరించింది. ఈ మేరకు విదేశాంశ శాఖ అడ్వైజరీ జారీ చేసింది.

రష్యన్ సాయుధ దళాల్లో చేరితే భారీగా డబ్బు వస్తుందని, ఆ తర్వాత భారత ప్రభుత్వాన్ని ఆశ్రయించి విడుదల కావచ్చని భావించి ఉద్దేశపూర్వకంగా రష్యా సైన్యంలో చేరేందుకు సిద్ధమవుతున్న వారినీ చూశామని కేంద్రం పేర్కొంది. కానీ, ఇది ప్రమాదకరమైన మార్గమని.. ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని ఉద్ఘాటించింది.

భారత పౌరసత్వాన్ని వదులుకొని, రష్యా పాస్‌పోర్టు తీసుకొని అక్కడి సైన్యంలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందని కేంద్రం వెల్లడించింది. భారత అధికారులను సంప్రదించకుండానే ఇప్పటికే పలువురు ఇలా చేశారని చెప్పింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

విదేశీ పౌరులను రష్యా సాయుధ దళాల్లో చేర్చేందుకు ప్రైవేట్ సంస్థలు, కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కేంద్రం తెలిపింది. విదేశాంగశాఖలో నమోదు కాని అనధికార ఏజెంట్ల నుంచి ఉద్యోగ ఆఫర్లు అంగీకరించే ముందు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం అక్టోబర్ 01,2026

## పొడుస్తున్న పొద్దు మీద ఉదయించని గానం..కమ్యూనిజం

# ముక్కలైన కమ్యూనిస్టులు ఏకమవుతారా!

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

తెలంగాణ కమ్యూనిస్టులు, భారత కమ్యూనిస్టులు ఏకమైనా, కాకపోయినా భారత రాజకీయాల్లో పెద్దగా మార్పు అంటూ ఉండకపోవచ్చని రాజకీయ పండితుల అంచనా.

**సాయుధ పోరాట మార్గాన్ని వీడి ప్రజాస్వామ్య పంథాలోకి వస్తున్న మాజీ మావోయిస్టు అగ్రనేతలు, మార్క్సిస్ట్–లెనినిస్ట్ (ML) గ్రూపులు మరియు ఇతర వామపక్ష శక్తులు కలిసి ఒక ఏకీకృత వేదికను ఏర్పాటు చేయడానికి చురుగ్గా ప్రయత్నిస్తున్నారు.**

బుల్లెట్ మార్గం కంటే బ్యాలెట్ ద్వారానే ప్రజా సమస్యలపై పోరాడటం సమంజసమనే వ్యూహాత్మక మార్పు ఇందులో కనిపిస్తోంది.

ఈ పరిణామాలపై తెలంగాణతో పాటు దేశంలో ఒక చర్చ మొదలయ్యింది.

**ఐక్య వేదిక ఏర్పాటుకు ముందడుగు**

ఇటీవల మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్‌జీ (తిప్పరి తిరుకేంద్రసంగ్రామ్ (మల్లా రాజిరెడ్డి), చంద్రన్న (పుల్లూరి ప్రసాద్ రావు) వంటి కీలక నేతలు ప్రజాస్వామ్య స్రవంతిలో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

తాము ఏ ఒక్క నిర్దిష్ట రాజకీయ పార్టీలో చేరకుండా, వామపక్ష, మార్క్సిస్ట్–లెనినిస్ట్ గ్రూపులు మరియు మైనారిటీ సంస్థలను ఒకే గొడుగు కిందికి తెచ్చి ఒక ఏకీకృత ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**జన తెలంగాణ పార్టీ లీడ్**
మరోవైపు, మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు లంక పాపిరెడ్డి నేతృత్వంలోని వర్గం 'జన తెలంగాణ పార్టీ' అనే కొత్త రాజకీయ వేదికను తెరపైకి తెచ్చి, రాబోయే ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులతో కలిసి పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

> ▪ అయితే ఈ జన తెలంగాణ పార్టీతో దేవ్‌జీ, సంగ్రామ్ బృందానికి ప్రత్యక్ష సంబంధం లేదని వారు స్పష్టం చేసినప్పటికీ, ప్రత్యామ్నాయ రాజకీయాల కోసమే అందరి అడుగులు పడుతున్నాయి.

**ఎజెండా మరియు ప్రధానాంశాలు**

ఈ వామపక్ష ఐక్య శక్తులు ఎన్నికల్లో పోటీ చేయడం కోసం మరియు ప్రజల్లోకి వెళ్లడం కోసం కొన్ని ముఖ్యమైన ఎజెండాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇన్నాళ్లు వల్లించిన కార్యక్రమాన్నే మళ్లీ కొత్తగా వినిపిస్తున్నారు.

**వనరుల దోపిడీపై పోరాటం**
సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వర్గాల దోపిడీని నిరోధించడం మరియు గిరిజన, అటవీ హక్కుల సంరక్షణ.

**నిరుద్యోగం & అవినీతి**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఇంకా నెరవేరని ప్రజల ఆకాంక్షలు, పరిపాలనా పరమైన అవినీతిపై గళమెత్తడం.

**ప్రజాస్వామ్య హక్కులు**
నిర్బంధాలు, ప్రజాస్వామ్య గొంతుకల అణచివేతకు వ్యతిరేకంగా ఫాసిజంపై పోరాడటం.
కమ్యూనిస్టు శక్తుల అంతర్గత సమీకరణాలు
తెలంగాణలో ఇప్పటికే ప్రధాన స్రవంతిలో ఉన్న వామపక్ష పార్టీలు (CPI, CPM) కూడా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికల అవసరాన్ని గుర్తిస్తున్నాయి.

> ▪ ఇప్పుడు మాజీ మావోయిస్టు శక్తులు సైతం ఎన్నికల రాజకీయాల వైపు మొగ్గు చూపడం వల్ల దాదాపు 8 కి పైగా చిన్న, పెద్ద వామపక్ష గ్రూపులు ఒకే తాటిపైకి వచ్చేందుకు రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయి.

**అవకాశాలు**

ఈ మాజీ సాయుధ నేతలకు దశాబ్దాలుగా క్షేత్రస్థాయిలో ప్రజలతో, గిరిజనులతో ఉన్న సంబంధాలు ఓట్ల సమీకరణకు ఉపయోగపడవచ్చు.

**సవాళ్లు**

వ్యవస్థీకృత పార్టీలతో పోటీ వామపక్షాలు తట్టుకుంటాయా!. బిజెపి, కాంగ్రెస్,బి.ఆర్.ఎస్ వంటి బలీయమైన ఆర్థిక, అంగబలం ఉన్న పార్టీలను ఎన్నికల బరిలో ఢీకొట్టడం సాధారణ విషయం కాదు.

**ఐక్యతా లోపాలు**
విభిన్న సిద్ధాంత వైరుధ్యాలు ఉన్న కమ్యూనిస్టు, మార్క్సిస్ట్–లెనినిస్ట్ గ్రూపులన్నింటినీ ఒకే నాయకత్వం కింద దీర్ఘకాలం ఉంచడం సవాలుతో కూడుకున్నది.

> ▪ ప్రస్తుత అధికార కాంగ్రెస్ మరియు ప్రతిపక్షాల వ్యూహాల నడుమ, ఈ సరికొత్త ఏకీకృత వామపక్ష ఫ్రంట్ ఎంతవరకు ఓటర్లను ఆకర్షించి 'మూడవ ప్రత్యామ్నాయ శక్తి'గా ఎదుగుతుందో లేదో రాబోయే కాలం తేల్చేస్తుంది.

> ▪ విభిన్న కమ్యూనిస్టు శక్తులు, మాజీ నక్సలైట్ మావోయిస్టు గ్రూపులు అన్నీ ఒకే ఏకీకృత వేదికగా ఏర్పడితే, అది దేశ రాజకీయ సమీకరణాల్లో గణనీయమైన మార్పులకు దారితీస్తుందా!.

వ్యవస్థీకృత సెక్యులర్ రాజకీయ పార్టీలపై మాత్రం ప్రభావం చూపుతుంది.

కాంగ్రెస్, BRS, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ వంటి సాంప్రదాయ సెక్యులర్ ప్రాంతీయ మరియు జాతీయ పార్టీలపై దీని ప్రభావం రెండు విధాలుగా ఉంటుంది.

**సెక్యులర్ ఓటు బ్యాంకు చీలిక**
కమ్యూనిస్టు శక్తులు ఒంటరిగా బరిలోకి దిగితే, సాంప్రదాయకంగా సెక్యులర్ పార్టీలకు పడే గిరిజన, దళిత, మైనారిటీ మరియు అణగారిన వర్గాల ఓట్లు చీలిపోతాయి. ఇది పరోక్షంగా సెక్యులర్ పార్టీల విజయ అవకాశాలను దెబ్బతీస్తుంది.

**కూటముల కోసం బేరసారాల శక్తి పెరగడం**
అన్ని వామపక్షాలు ఏకతాటిపైకి వస్తే, వారి పొత్తు లేకుండా గెలవడం కష్టమని సెక్యులర్ పార్టీలు భావిస్తాయి.

> ▪ దీనివల్ల సీట్ల సర్దుబాటులో కమ్యూనిస్టుల బేరసారాల శక్తి పెరుగుతుంది. సెక్యులర్ పార్టీలు తమ ఎజెండాలో వామపక్ష భావజాల కూటమికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తుంది. దీనితో సెక్యులర్ పార్టీలు పోటీ స్థానాలు తగ్గించుకోవాల్సి వస్తుంది.

**సెక్యులర్ పార్టీలపై నైతిక ఒత్తిడి**
సెక్యులర్ పార్టీలు తరచూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తున్నాయని వామపక్షాలు విమర్శిస్తాయి.

కమ్యూనిస్టుల ఐక్యత వల్ల ఈ పార్టీలు తమను తాము నిజమైన "ప్రజా పక్షపాత" పార్టీలుగా నిరూపించుకోవాల్సిన ఒత్తిడి పెరుగుతుంది.

**ప్రజా వ్యతిరేకతను ఓట్లుగా మార్చడం**
నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ప్రైవేటీకరణ వంటి ఆర్థికాంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను కమ్యూనిస్టులు సమర్థవంతంగా ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లగలిగినా, పొత్తుల వల్ల రాష్ట్రాల్లో కూటమి పార్టీలు పరస్పరం సమర్థించుకోలేక విమర్శించుకోలేక అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది.

అండర్ గ్రౌండ్, అప్పర్ గ్రౌండ్ కమ్యూనిస్టు శక్తులు, సెక్యులర్ శక్తులు ఒక్కటైతే మైనారిటీ మత శక్తులు కూడా ఈ కూటమితో కలిసి వస్తాయి.

తెలంగాణలోని జిల్లాల వారీగా ఈ ఐక్య శక్తుల ప్రభావం ఎలా ఉంటుందో మరియు జాతీయ స్థాయిలో INDIA కూటమిపై దీనివల్ల పడే ప్రభావం ఎలా ఉంటుందో చూదాం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీపుల్స్ వార్, జనశక్తి పార్టీలు నక్సలైట్ ఉద్యమానికి, సాయుధ పోరాటాలకు నిలయంగా ఉండేవి.

తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మరియు ఆదిలాబాద్ జిల్లాలలో ఈ ఐక్య శక్తుల ప్రభావం కీలకంగా ఉండాలని ప్రయత్నం జరుగుతున్నది.

> ▪ ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం లో సాంప్రదాయకంగా CPI, CPM పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. గిరిజన ప్రాంతాలు, సింగరేణి కార్మిక బెల్ట్ ఎక్కువగా ఉండటం వల్ల మాజీ మావోయిస్టు శక్తుల ఏకీకరణ వల్ల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు అనుకూలంగా ఉన్నప్పటికీ అది అధికారం సాధించ గలిగే స్థాయిలో ఉంటుందా అనేది ప్రశ్న.




ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ ప్రాంతాలు ఒకప్పుడు సాయుధ పోరాటానికి ప్రధాన కేంద్రాలు. పోడు భూముల సమస్యలు, ఆదివాసీ హక్కుల ఎజెండాతో వీరు ఇక్కడ బలమైన ప్రభావం చూపగలరు.

ఉమ్మడి ఆదిలాబాద్ ఎ కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ లాంటి ప్రాంతాలు కూడా కమ్యూనిస్టు శక్తుల ప్రభావములో ఉంటాయి.

సింగరేణి బొగ్గు గనుల కార్మికులు, అటవీ గ్రామాల జనాభా ఇక్కడ ఎక్కువ. కార్మిక సంఘాలు (AITUC, CITU) మరియు మాజీ విప్లవ శక్తులు కలిస్తే ఇక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో మరియు అసెంబ్లీ స్థానాల్లో ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేయగలమని అనుకుంటున్నారు.

ఇండి కూటమిపై ప్రభావం ఉంటుందా?

> ▪ అన్ని రకాల కమ్యూనిస్టు శక్తుల ఏకీకరణ జాతీయ స్థాయిలో 'INDIA' కూటమిపై కచ్చితంగా ప్రభావం చూపుతుంది.జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూసివ్ అలయన్స్.. కూటమిపై ఈ సరికొత్త వామపక్ష ఐక్యత తీవ్రమైన రాజకీయ కుదుపులకు లేదా వ్యూహాత్మక మార్పులకు కారణం కావచ్చు.

**కూటమి లోపల అంతర్గత ఘర్షణలు**

ఇప్పటికే కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వంటి సెక్యులర్ పార్టీలతో వామపక్షాలకు ముఖ్యంగా ఐప్‌వీ, CPI ల మధ్య తీవ్రమైన రాజకీయ వైరుధ్యాలు ఉన్నాయి.

ఇప్పుడు అదనంగా తీవ్ర వామపక్ష మీ గ్రూపులు, మాజీ మావోయిస్టు శక్తులు కూడా ఈ వేదికల్లోకి వస్తే, సీట్ల సర్దుబాటు మరియు కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ రూపకల్పనలో "ఇండి కూటమి"కి పెద్ద తలనొప్పిగా మారుతుంది.

**ఐక్యతను బలహీనపరిచే అంశాలు**
కమ్యూనిస్టు శక్తులు కాంగ్రెస్ యొక్క ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తాయి. ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల ధోరణిని అన్ని వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయి.

ఈ సిద్ధాంతపరమైన పట్టుదల వల్ల కొన్ని రాష్ట్రాల్లో కమ్యూనిస్టులు కూటమి నుంచి విడిపోయి ఒంటరిగా పోటీ చేసే ప్రమాదం ఉంది.

ఇది కూటమి సాధించాలనుకునే 'ఒకే అభ్యర్థి – ఒకే ఓటు' వ్యూహాన్ని దెబ్బతీసి, ఓట్లను చీల్చుతుంది.

**సార్వత్రిక ఎజెండా మార్పు**
ఒకవేళ ఈ శక్తులన్నీ INDIA కూటమిలో కొనసాగితే, కూటమి యొక్క మొత్తం ఎజెండా మరింత 'ఎడమ వైపు' మొగ్గు చూపుతుంది.

అంటే భూసంస్కరణలు, సంపద పంపిణీ, కార్పొరేట్ నియంత్రణ వంటి అంశాలపై కాంగ్రెస్ మరియు ఇతర ప్రాంతీయ పార్టీలు మరింత స్పష్టమైన మరియు తీవ్రమైన హామీలు ఇవ్వాల్సి వస్తుంది.

> ▪ కమ్యూనిస్టు శక్తుల ప్రయోగశాల తెలంగాణ కాబోతుందా!

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ తో పాటు వామపక్ష శక్తులు కూడా కలిసి పని చేశాయి. వామపక్ష కళా బృందాలు క్రియాశీలంగా పాల్గొన్నాయి.

తెలంగాణ ఏర్పడిన తరువాత కెసిఆర్ నుండి తెలంగాణ ప్రభుత్వము నుండి సరైన ఆదరణ లభించలేదన్న కోపంతో ఈ వామపక్ష శక్తులు కాంగ్రెస్ వెనకాల చేరాయి.

> ▪ వామపక్ష శక్తులను అందరూ వాడుకొని వదిలేస్తున్నారని సాయుధ అవతారం చాలించిన మావోయిస్టులతో కలసి ఒక సమిష్టి వామపక్ష వర్గ సృష్టికి ప్రయత్నాలు ప్రారంభించారు.

తెలంగాణలో బిజెపి బలపడుతున్నదని భావించిన వామపక్ష శక్తులు బి.ఆర్.ఎస్ ను వదిలి గత్యంతరం లేక కాంగ్రెస్ వెనకాల చేరిపోయాయి.

దశాబ్దాల తమ వామపక్ష పోరాటాల ప్రభావం కోల్పోకూడదని వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి.

> ▪ సాయుధ పోరాటానికి, అధికార రాజకీయ పోరాటానికి వ్యత్యాసాన్ని గమనించిన వామపక్షాలు తమకు కేంద్ర బిందువు లేదని, ఏకీకృత నాయకత్వం లేదని భావించారు.

ఒక కేసిఆర్ మాదిరిగా, రేవంత్ రెడ్డి మాదిరిగా, బండి సంజయ్ మాదిరిగా తమకు ఒక నాయకుడిని ఫోకస్ చేయాలని భావించిన వామపక్షాలు గద్దర్ ను కేంద్రంగా చేశాయి.

ఈ మొత్తం రాజకీయ ఎత్తుగడలలో గద్దర్ తో పాటు గాదె ఇన్నయ్య తదితరులు పాల్గొన్నారు. టిఆర్ఎస్, కేసిఆర్ ల పాలనపైన ప్రజా వ్యతిరేకత ఉన్నదని భావించిన వామపక్షాలు కాంగ్రెస్ వెనకాల చేరాయి.

> ▪ మొత్తానికి, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వామపక్షాలతో కుదిరిన రహస్య ఒప్పందంలో భాగంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట సినిమా అవార్డులు కూడా ప్రారంభించింది.

కానీ, గద్దర్ మరణం తరువాత వామపక్ష శక్తులకు కేంద్ర బిందువు లేకుండా పోయింది. ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు నక్సలైట్ల ఆయుధ ఆకర్షణ తగ్గిపోవడంతో వామపక్ష శక్తులు ఇంకొక ప్రయోగం ప్రారంభించాయి.

మరణించిన గద్దర్ స్థానంలో ఎవరు అనే ప్రశ్న నుండి, ఆలోచనలోంచి పుట్టుకొచ్చిన ప్రత్యామ్నాయ ఎత్తుగడ అరుణోదయ విమలక్క 50 వసంతాల ప్రజా సాంస్కృతిక ప్రయాణం -- 50 గంటల ప్రజా కళా జాతర.

> ▪ విమలక్క జానపద సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను ఉత్తేజ పరచడం సాధ్యమవుతుందేమో కానీ రాజకీయ అధికార కేంద్రంగా ఆమె వ్యక్తిత్వం సరిపోదనే అభిప్రాయం వినిపిస్తున్నది.

విమలక్క కేంద్రంగా సెప్టెంబర్ 26, 27, 28 తేదీలలో నిరంతరాయంగా 50 గంటల పాటు ఈ సాంస్కృతిక జాతర సాగింది.

ఈ మహాసభల్లో ప్రముఖ సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజా గాయకులు గోరేటి వెంకన్న, మిద్దె రాంరర్సయ్య, రేలారే గంగాతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వందలాది మంది ప్రజా కళాకారులు, కవులు, సాంస్కృతిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విమలక్క జీవితం మరియు ప్రజా ఉద్యమాలపై ప్రత్యేక గీతాలను ఆవిష్కరించి ప్రజాకర్షణను నిలుపుకునే ప్రయత్నం జరిగింది.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వారా ఆమె ఐదు దశాబ్దాలుగా సాగించిన అలుపెరగని పోరాటాలు, జైలు జీవితం మరియు ఆమె గాన ప్రయాణాన్ని ఈ సభల ద్వారా గుర్తుచేసుకున్నారు.
గద్దర్ తర్వాత స్థాయి కళాకారిణి గా విమలక్కకు గుర్తింపు ఉంది.

పీడిత ప్రజల గొంతుకను, కళలను సజీవంగా ఉంచడం పేరుతో,సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల ఆక్రందనలను, హక్కులను పాట రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వామపక్ష వ్యూహం ప్రారంభమైంది. ఈ సమావేశం తో ప్రజావేశాన్ని సజీవంగా ఉంచాలని ప్రయత్నం జరిగింది.

> ▪ సామాజిక రుగ్మతలపై అవేర్‌నెస్ మరియు జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం, పౌర హక్కుల రక్షణ కోసం విమలక్క చేసిన పోరాటాలను రాబోయే తరాలకు వివరించే పాత ప్రయత్నం జరిగింది.

సామాజిక న్యాయం కోసం నిలబడేలా యువతను ప్రేరేపించడం ఈ సమావేశాల లక్ష్యం. తెలంగాణ ఉద్యమ త్యాగాల పునశ్చరణ చేస్తూ..1995 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అరుణోదయ సంస్థ ద్వారా ధూం-ధాం కార్యక్రమాలు నిర్వహిస్తూ విమలక్క కీలక పాత్రను ప్రజలకు గుర్తు చేయడం ఈ సమావేశం ఉద్దేశ్యం.

> ▪ ఎందరో అమరవీరుల త్యాగాల వల్ల సిద్ధించిన తెలంగాణలో నేటికీ సాధించాల్సిన "సామాజిక తెలంగాణ" లక్ష్యాలను మేధావులతో చర్చించడం ఈ సభల ముఖ్య ఉద్దేశ్యంగా ప్రకటించి తమ ప్రాముఖ్యతను చాటుకోవడం,వామపక్ష శక్తుల పట్ల ఆకర్షణను పెంపొందించడం లక్ష్యంగా కనిపిస్తున్నది.

> ▪ నైజాం వ్యతిరేక సాయుధ పోరాట కాలం నుండి పనిచేస్తూ వచ్చిన సాయుధ వామపక్ష పోరాటం దశాబ్దాల తరువాత కూడా దిక్కులు చూస్తున్నది.

ప్రజల అభిప్రాయాన్ని పసిగట్టడంలో, రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకోవడంలో వామపక్షాలు వరుసగా చారిత్రక తప్పిదాలు చేస్తూ వచ్చాయి.ప్రజలను తమ వెంట నడపడంలో విఫలం చెందిన కమ్యూనిజం ఇతరులకు నీడలాగా పయనిస్తున్నది.

**యువజన, విద్యార్థి, కార్మిక, కర్షక ఉద్యమాలు అంటూ.. అరాచక శక్తులతో కూడా చేయి కలిపి కమ్యూనిజం భారత దేశంలో ఒక అనుమానాస్పద శక్తిగా మారింది.**
ఆపరేషన్ కగార్ తదనంతరం సాయుధ నక్సలిజం అంతరించింది. వాళ్ళు అర్బన్ నక్సలైట్లుగా, దిమాగీ నక్సలైట్లుగా పనిచేయడానికి పరిమితమైపోయారు.

పొడుస్తున్న పొద్దు మీద కమ్యూనిజం నడవడం లేదు. తెలంగాణలో కమ్యూనిస్టుల శక్తి పరిమితం. కానీ వారి సంఘాలు మాత్రం అనేకం.

ఏ కమ్యూనిస్టు సమావేశంలో చూసిన సాధారణంగా ఒకే రకమైన వ్యక్తులు కనిపిస్తారు. మొన్నటి విమలక్క 50 వసంతాల ప్రజా సాంస్కృతిక ప్రయాణం సమావేశంలో కూడా ఈ వ్యక్తులే కనిపించారు.

> ▪ ఆయుధ ఆకర్షణ కోల్పోయిన కమ్యూనిస్టు శక్తులు ఇప్పుడు ఎన్నికల రాజకీయ సిద్ధాంతాలను వల్లవేస్తున్నాయి.

సమాజాన్ని ఆర్థిక కోణంలో మాత్రమే చూసే కమ్యూనిస్టులకు భారతీయ తాత్విక సాంస్కృతిక ఆధ్యాత్మిక విలువలు ఇప్పటికీ అర్థం కాలేదు. భౌతిక వాదాన్ని నమ్మే భారత కమ్యూనిస్టులు కూడా కేవలం భౌతిక కార్యక్రమాలకే పరిమితమయ్యారు. భారతీయ ఆత్మ కమ్యూనిస్టులకు ఇప్పటికీ అర్థం కాలేదు.

**శతాబ్దాలుగా భారతదేశ అణచివేతకు అరాచకానికి గురి అయినప్పటికీ, ఆర్థిక దోపిడీకి గురైనప్పటికీ స్థిరమైన సామాజిక రూపంతో నిలిచి ఉన్న భారతదేశాన్ని కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు.**

> ▪ కమ్యూనిస్టులు ఎన్ని వర్గాలుగా విడిపోయినా ఈ దేశం బాధపడలేదు. వీళ్లంతా ఒక్కటైనా భారతీయ సమాజం పొంగిపోదు. స్థితప్రజ్ఞత అంటే అర్థం తెలియని గతి తార్కిక సిద్ధాంతం ఇప్పటికీ భారతీయులకు అర్థం కాలేదు. అర్థం చేసుకోవాల్సిన అవసరం కూడా లేదేమో!

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం అక్టోబర్ 01,2026

# రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు కృషి చేస్తా..

- ఇ.వి. శ్రీనివాస్ రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు



కరపత్రం ప్రతినిధి – హనుమకొండ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.వి. శ్రీనివాస్ రావును పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, సమాజంలోని ప్రతి వర్గానికి సేవలు చేరేలా సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తిని మరింత విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, రెడ్డి జాగృతి నాయకులు గుర్రం ప్రభాకర్ రెడ్డి, రెంటాల కేశవరెడ్డి తదితరులు పాల్గొని ఇ.వి. శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లకు ఓసీ జేఏసీ సంపూర్ణ మద్దతు

- అక్టోబర్ 2న ఢిల్లీకి ఓసీ ఐకాస ప్రతినిధులు



కరపత్రం ప్రతినిధి హైదరాబాద్: ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల అమలుకు ఓసీ ఐకాస సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఢిల్లీలో ని రాజ్ ఘాట్ నుంచి సామాజిక ఉద్యమ కారుడు ప్రవీణ్ ఆరోరా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల బస్సు యాత్రకు ఓసీ జేఏసీ మద్దతుగా నిలవాలని నిర్ణయించిందని జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. ఈమేరకు హైదరాబాద్ లో ఓసీ ఐకాస జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రతినిధులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2 న ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు తరలి వెళ్లి మద్దతుగా భాగ స్వాములు కావాలని సమావేశం లో తీర్మానించారు. ఈ బస్సు యాత్ర తెలుగు రాష్ట్రాల్లో విజయ వంతంగా నిర్వహించేందుకు ఓసీ ఐకాస తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు కృషి చేయాలని నిర్ణయించారు. అన్ని సామాజిక వర్గాల్లోని ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు ఆర్థిక ప్రాతి పదికన రిజర్వేషన్ల అంశం పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి సమన్వయము తో పని చెయాలని ప్రతినిధులు పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల పేదలకు విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో సమన్యాయం జరుగుటకు కుల,మత ప్రాతి పదికన కాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ లు కల్పించాలన్నదే తమ ఓసీ జేఏసీ ధ్యేయం అని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఐకాస జాతీయ చైర్మన్ నల్లా సంజీవ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ఓసీ జేఏసీ అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దుబ్బా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి,ఏపీ జేఏసీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు ప్రతినిధులు చెన్నమనేని పురుషోత్తంరావు, చందుపట్లనర్సింహారెడ్డి,కొత్తకొండ రవీందర్ రావు,వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి విద్యార్థుల సేవా కార్యక్రమం



కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని సెప్టెంబర్ 30: వృద్ధుల పట్ల గౌరవం, ప్రేమ, ఆప్యాయతతో పాటు సేవా భావాన్ని చిన్నారుల్లో పెంపొందించేందుకు కృష్ణవేణి పాఠశాలలు, గోదావరిఖని అడ్డగుంటపల్లి శాఖ ఆధ్వర్యంలో అవర్ ఎల్డెర్స్.. అవర్ రెస్పాన్సిబిలిటీ.. అనే అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వీర్లపల్లి గ్రామంలో ఉన్న ఈశ్వర కృప వృద్ధాశ్రమన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న వృద్ధుల స్థితిగతులను తెలుసుకుని, వారి జీవన పరిస్థితులు, అవసరాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమవంతుగా సమకూర్చిన మొత్తంతో 25 కేజీ రైస్ బాగ్, దుప్పట్లు, బనానా, బ్రేడ్, ఇతర అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి వృద్ధులకు అందజేశారు. వృద్ధులతో కొంత సమయం ఆప్యాయంగా గడిపి, వారితో మాట్లాడి వారి ఆశీర్వాదాలు పొందారు.పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులతో కలిసి వీర్లపల్లి గ్రామ వీధులలో పిల్లలతో ర్యాలీగా వెళ్లి వృద్ధాశ్రమాన్ని సందర్శించి, వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వృద్ధుల అనుభవాలు, జీవిత విలువలను గౌరవించడం మనందరి బాధ్యత అని విద్యార్థులకు వివరించారు.చిన్న వయసులోనే విద్యార్థుల్లో మానవతా విలువలు, సేవా భావం, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలి

- ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కూతురు సత్తనారాయణ



కరపత్రం ప్రతినిధి, పరకాల సెప్టెంబర్ 30 పరకాల: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకుని సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని విశ్రాంత అధ్యాపకులు, పూర్వ ఎన్ఎస్-ఎస్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కూతురు సత్తనారాయణ పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల--పరకాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.“నాట్ మీ బట్ యూ -- నేను కాదు... నువ్వు” అనేది ఎన్ఎస్ఎస్ ప్రధాన నినాదమని, స్వార్థానికి దూరంగా సమాజ సేవకు చేరువయ్యేలా విద్యార్థులను జాతీయ సేవా పథకం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక స్పృహ పెంపొందుతాయని పేర్కొన్నారు.తరగతి గదిలో విద్యను అభ్యసించడంతో పాటు సమాజంలో నెలకొన్న సమస్యలను అర్థం చేసుకోవడం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, రక్తదానంపై అవగాహన, ఆరోగ్య కార్యక్రమాలు, బాలల విద్య, మహిళా సాధికారత, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, సైబర్ నేరాలపై అవగాహన వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఏ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజం మనపై ఎన్నో బాధ్యతలను ఉంచిందన్నారు. చదువుకున్నవారిగా సమాజానికి తిరిగి ఏదో ఒక రూపంలో సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. “చిన్న సేవ -- పెద్ద మార్పుకు నాంది” అనే భావనతో ప్రతి విద్యార్థి సామాజిక సేవలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ అశోక్ అలిశాల, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

- సీఎం, మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్



కరపత్రం ప్రతినిధి, కరీంనగర్: సెప్టెంబర్ 30 కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఘన స్వాగతం పలికారు. సీఎం వెంట వచ్చిన రాష్ట్ర మంత్రులకు సైతం ప్రణవ్ మర్యాదపూర్వకంగా స్వాగతం తెలిపారు.ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నాయకుల మధ్య పరస్పర చర్చ జరిగినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అందుబాటులోకి రావడం ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన కార్యాలయాలు ఒకే చోట ఉండటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనుల కోసం కరీంనగర్‌కు వచ్చే ప్రజలకు ఒకే ప్రాంగణంలో అనేక సేవలు అందుబాటులోకి రావడం వల్ల సమయం, వ్యయ భారం తగ్గే అవకాశం ఉందన్నారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రభుత్వ సేవలను వేగంగా అందించడం లక్ష్యంగా ఇటువంటి సమీకృత కార్యాలయాల నిర్మాణం చేపట్టడం జరుగుతోందని తెలిపారు.కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ వెంట హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సీఎంకు, మంత్రులకు స్వాగతం పలికారు.హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ప్రణవ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# బ్రాహ్మణపల్లి లో ఘనంగా పల్లెపండుగ 3.0 కార్యక్రమం

- పలు సిసి రోడ్ల నిర్మాణం కొరకు భూమి పూజ కార్యక్రమం
- గ్రామసీమల అభివృద్ధికి ‘పల్లె పండుగ 3.0
- ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు





కరపత్రం ప్రతినిధి , పిడుగురాళ్ల, సెప్టెంబర్ 30 : గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామం నందు సీసీ రోడ్ల నిర్మాణం కోసం చేస్తున్న భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘పల్లెపండుగ 3.0’ ఉపాధి హామీ అనుసంధాన కార్యక్రమం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తోంది. దీనిలో భాగంగానే గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లి గ్రామం నందు సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ మరియు శంకుస్థాపన కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధి యరపతినేని శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, అధికారులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో అధికారికంగా ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రహదారులను మెరుగుపరచి, ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం.

**పల్లెపండుగ 3.0 -- కార్యక్రమ ముఖ్య ముఖ్యాంశాలు:**

రాష్ట్రవ్యాప్త నిధుల కేటాయింపు: ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సుమారు రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**సీసీ రోడ్ల లక్ష్యం:**

ఈ విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.2,700 కోట్ల వ్యయంతో దాదాపు 6,000 కిలోమీటర్ల మేర నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

**సమగ్ర అభివృద్ధి:**

రోడ్ల నిర్మాణంతో పాటు మురుగునీటి పారుదల కోసం మ్యాజిక్ డ్రెన్లు, ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలు మరియు ఇతర మౌలిక వసతులను గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రారంభమైన ఈ సీసీ రోడ్ల పనుల ద్వారా వర్షాకాలంలో బురద రోడ్ల సమస్యల నుంచి గ్రామస్థులకు శాశ్వత విముక్తి లభించనుంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా ఈ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# విధి నిర్వహణలో అంకితభావానికి గుర్తింపు..

» రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని సెప్టెంబర్ 30: సమర్థవంతంగా, అంకితభావంతో విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్,గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బొజ్జ సురేందర్‌ను బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమైన ఘట్టమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ సురేందర్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఎలాంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీ హామీ ఇచ్చారు. సురేందర్, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, ఆయన పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, భీమేష్, ఆర్ఐ మల్లేశం,సీసీ సందీప్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సభ్యులు కపిల్, సురేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా ఛాంపియన్స్ కు అభినందనలు.

» జాతీయ స్థాయి యోగాలో రాణించాలి.

» జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ.



కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ఓవరాల్ చాంపియన్షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులను జిల్లా యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ అభినందించారు. బుధవారం స్థానిక తారక హోటల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 3 నుండి 6 వరకు రాజస్థాన్ లోని జైపూర్ లో జరుగు జాతీయస్థాయి పోటీలలో పాల్గొని పలు పథకాలు సాధించాలని కోరినారు ఉమ్మడి జిల్లా నుండి ఎంపికైన వారిలో ఏ.నవ తేజ, కిర్ల సూరజ్ , ఎం. ఇషాని, బి .తన్సేజ్, బి. రిషిక, ఎన్. ఆదిత్య, జి. శ్రీ హర్ష , టీ .హర్షిత్ బాలాజీ, పి. దీపక్ , రంజిత్ (కరీంనగర్) టి కమాలిని (జగిత్యాల) వీ. కీర్తన, డి .వైష్ణవి(రాజన్న సిరిసిల్ల) ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి గుంటి రామకృష్ణ , కోచ్లు గంగాధర్, వి. కిష్టయ్య, పి. మల్లేశ్వరి, ఏ .ఆనంద కిషోర్ , ఎం. వికాస్ తదితరులు అభినందించారు.